కాకినాడను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ యంత్రాగం కృషిచేస్తోంది. అక్టోబరు 2 నుంచి బహిరంగ మల విసర్జన రహిత నగరంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పెద్దఎత్తున నగరంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. అవసరమైన చోట్ల సామాజిక మరుగుదొడ్లను కూడా వినియోగంలోకి తెస్తున్నారు. ఇందుకోసం నగరంలో పెద్ద ఎత్తున ప్రచారాన్ని చేపట్టారు.

**- న్యూస్‌టుడే, కాకినాడ నగరం**



జాగాలేకున్నా ఇంటి అరుగుపైనే మరుగుదొడ్డి నిర్మాణం

# స్వచ్ఛత దిశగా అడుగులు

## ● నగరంలో బహిరంగ మల విసర్జన నిషేధం
## ● అక్టోబరు 2 నుంచి అమలు

ఆకర్షణీయ నగరంగా కాకినాడ ఎంపికైన నేపథ్యంలో ప్రథమ అంశంగా పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలో బహిరంగ మల విసర్జనను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించారు. అక్టోబరు 2 నుంచి బహిరంగ మల విసర్జనకు వెళితే జరిమానా విధించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అందులో భాగంగా నగరంలో పెద్దఎత్తున వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారు.

✤ నగరంలో 75 వేల కుటుంబాలున్నాయి. వీరిలో 10 వేల కుటుంబాల వరకూ మరుగుదొడ్ల సదుపాయం లేనట్లు ప్రాథమికంగా గుర్తించారు. స్థల సమస్య కారణంగా కొందరికి, అవగాహన లేక మరికొందరికి బహిరంగ విసర్జనకు అలవాటుగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు నెలకొంటున్నాయి. కాకినాడను ఆకర్షణీయ నగరంగా ఎంపిక చేసిన నేపథ్యంలో ప్రథమ ప్రాధాన్యం పారిశుద్ధ్యానికి ఇస్తూ చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటికి మరుగదొడ్ల సదుపాయాన్ని కల్పించి, తద్వారా బహిరంగ మల విసర్జనను నిర్మూలించాలని నిర్ణయించారు. ఇందుకోసం పెద్దఎత్తున ప్రచారం నిర్వహించటంతో పాటు ఇబ్బడిముబ్బడిగా వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేశారు. ఇలా స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల కింద నాలుగు వేల మరుగుదొడ్లను మంజూరు చేశారు. వీటిని త్వరితగతిన నిర్మించటంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచి ప్రగతి సాధించారు. మంజూరైన మూడు నెలల కాలంలో 3,800 మరుగుదొడ్లను పూర్తిచేయించగలిగారు. మిగతావి కూడా వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఏఈ స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి, స్వయంగా కమిషనర్ అలీంబాషా నిర్మాణాలను పర్యవేక్షించటంతో త్వరితగతిన ప్రగతిని చేరుకోవగలిగారు.

✤ బహిరంగ మలవిసర్జన సాగుతున్న శివారు ప్రాంతాలైన ఏటిమొగ, ముగ్గుపేట, బాపూజీకాలనీ, దుమ్ములపేట, సంజయ్‌నగర్, పర్లోవపేట, తదితర ప్రాంతాల్లో నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు.

### బహిరంగ మలవిసర్జనకు జరిమానా

సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించేందుకు నగరపాలక సంస్థ కఠిన చర్యలను అవలంబించాలని నిర్ణయించింది. బహిరంగ మలవిసర్జనకు వెళితే జరిమానా విధించాలని నిర్ణయించింది. అక్టోబరు 2 నుంచి దీన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే మైకులు, హోర్డింగుల ద్వారా పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తోంది. బహిరంగ మలవిసర్జన మానకుంటే ఆ ప్రాంతాలకు తాగునీటిని కూడా నిలుపుదల చేయాలని భావిస్తున్నారు. బహిరంగ మల విసర్జన వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించేందుకు మహిళా సంఘాలతో 'స్వచ్ఛ దూత్' పేరిట కార్యకర్తలను నియమించారు. వీరు వార్డుల్లో తిరిగి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, సామాజిక మరుగుదొడ్ల వినియోగంపై చైతన్యం కల్పిస్తున్నారు. ఇందుకోసం నగర వ్యాప్తంగా 20 బృందాలను నియమించారు.

### వినియోగంలోకి సామాజిక మరుగుదొడ్లు

నగరంలో కొన్నిచోట్ల స్థలాల కొరత కారణంగా వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకునే అవకాశం లేదు. దాంతో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మల విసర్జన జరుగుతోంది. అటువంటి ప్రాంతాలను గుర్తించి అక్కడ కూడా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఏటిమొగ, భాస్కరనగర్, అయోధ్యనగర్, గైగోలుపాడు ప్రాంతాల్లో కొత్తగా సామాజిక మరుగుడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. గతంలో దుమ్ములపేట, డైరీఫారం, బాపూజీనగర్, పద్మనాభనగర్ తదితర ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్లను నిర్మించారు. నిర్వహణలోపం కారణంగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం వాటికి కూడా మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని నిర్ణయించారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి సామాజిక మరుగుదొడ్లను నిర్మించాలని నిర్ణయించారు.

### అమలు సరే.. ఆచరణేదీ..?

నగరంలో పెద్దఎత్తున వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఈ విషయంలో ప్రగతి సాధించిన మాట వాస్తవమే. అయితే కొన్నిచోట్ల నిర్మించుకున్న మరుగుదొడ్లను ప్రజలు వినియోగించుకోవటం లేదు. అవగాహనలేమి కారణంగా మరుగుదొడ్లున్నా.. బహిర్భూమికే వెళుతున్నారు. దుమ్ములపేట, పర్లోవపేట, ఏటిమొగ ప్రాంతాల్లో ఇటువంటి పరిస్థితులున్నాయి. మరుగుదొడ్లను వంట చెరుకు, ఇతర సామగ్రిని భద్రపరచుకునేందుకు వినియోగించుకుంటున్నారు.

✤ మరోవైపు జన సంచారం అధికంగా ఉండే పలు కూడళ్లవద్ద మరుగుదొడ్ల సదుపాయంలేదు. జగన్నాథపురం వంతెన, పాతబస్టాండ్, బాలాజీచెరువు, భానుగుడి, నాగమల్లితోట జంక్షన్, ఆర్టీవో కార్యాలయం తదితర ప్రాంతాల్లో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవటంతో అక్కడ అపారిశుద్ధ్య పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక్కడ కూడా మరుగుదొడ్లను నిర్మిస్తే ప్రయోజనం ఉంటుంది.

### సమష్టి బాధ్యత అవసరం



బహిరంగ మలవిసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్నాం. ఇందుకు సమష్టి బాధ్యత అవసరం. ప్రజల్లోనూ చైతన్యం రావాలి. వ్యక్తిగత మరుగుదొడ్డిని అవసరతగా భావించాలి. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని మరుగుదొడ్లను నిర్మించుకోవాలి. జరిమానా భయంతో కాకుండా సామాజిక బాధ్యతగా మరుగుదొడ్లను నిర్మించుకోవాలి. స్థలాల కొరత కారణంగా కొన్నిచోట్ల మరుగుదొడ్లను నిర్మించుకోలేకపోవటం వాస్తవమే. అటువంటి వారికోసం సామాజిక మరుగుదొడ్లను నిర్మిస్తున్నాం.

**- ఎస్.అలీంబాషా, నగరపాలక సంస్థ కమిషనర్**